

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా. 6.26
సహరి (ఆది) ఉ. 4.30

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	44.0	24.0



మండిన రాజమహేంద్రి

- శుక్రవారం 44 డిగ్రీల ఉష్ణోగ్రత
- మలమలమాడిపోయిన జనం
- నిర్మానుష్యంగా మారిన వీధులు
- ఏప్రిల్ నెలలోనే భానుడి ఉగ్రరూపం
- భయపడుతున్న ప్రజానీకం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5 : ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చాడు. జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరాయి. గత వారం రోజులుగా భానుడు 40 డిగ్రీలకు చేరువయ్యాడు. మే మొదటి వారంలో కాసే ఎండలు ఏప్రిల్ మొదటి వారంలో కాస్తున్నాయి. నెల రోజుల ముందే భానుడు ప్రతాపానికి ప్రజలు భయపడుతున్నారు. మార్చి నెలాఖరున 36 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఈ నెల ఆరంభం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూవచ్చాయి. గత నాలుగు రోజులుగా 40-41 మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ నెల 5 నుంచి తీవ్రస్థాయిలో ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన ప్రకారమే శుక్రవారం జిల్లాలో తీవ్రస్థాయిలో ఏండ కాసింది. శుక్రవారం రాజమహేంద్రవరం ఉష్ణోగ్రత గరిష్ఠం 44.0 కనిష్ఠం 24.0గా నమోదైంది. ఎండదెబ్బకు రాజమహేంద్రవరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ముఖ్య పట్టణాలు గ్రామాల్లో ఎండ త్రీవగానే కాసింది. దీంతో ప్రజలు మలమలమాడిపోయారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రు మనిపించాడు. మధ్యాహ్నం సమయానికి మరింత ప్రతాపం చూపాడు. ఎండ తీవ్రత అమాంతం పెరగడంతో వడగాడ్పులు వీచాయి. సీసీ రోడ్లు, ఇరుకు సందుల మధ్య ఉన్న భవనాల్లో అత్యధిక ఉష్ణం ఉత్పన్నమైంది. ఏసీలు, కూలర్లు ఉన్నవారు వాటిని ఆన్‌చేసుకుని సేదతీరగా పేదలు మాత్రం వారి ఇళ్ల ముంగిట బెడ్ షీట్లు, గోనే సంచులు తడిపి సేద తీరారు. చంటి పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఒకేసారి 4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలువిలవిల లాడారు. రహదారులన్నీ నిర్మానుషంగా దర్శనమిచ్చాయి. తప్పక పనులకు వెళ్లాల్సిన వారు మాత్రం గొడుగులు, కూలింగ్ కళ్లజోళ్ళు, కాటన్ పేస్ మాస్కులు, టోపీలు ధరించి వెళ్లారు. సాయంత్రంవేళ శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ తీసుకుని ఎండ తీవ్రతనుంచి ఉపశమనం పొందారు.



స్పీడ్ పెంచాలి!

కూటమి అభ్యర్థులకు చంద్రబాబు దిశా నిర్దేశం

- అంతా విజయం సాధించాలి
- రాజమహేంద్రవరం సిటీ, రూరల్ భేష్
- అన్ని నియోజకవర్గాల్లో దూకుడు పెంచాలి
- రెండు రోజుల్లో అనపర్తి సీటుపై క్లారిటీ
- కొవ్వూరులో జవహర్‌ను కలుపుకోవాలి
- నిడదవోలులో జోరు పెంచండి
- గోపాలపురాన కలుపుకుని వెళ్లాలి
- రాజానగరం ఇంకా పికప్ కావాలి
- తరువాత నేను..పవన్ ఉమ్మడి పర్యటన

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుంది. మన ప్రభుత్వం ఏర్పడుతుంది. జిల్లాలో అభ్యర్థులు, నేతలు బాగా పనిచేస్తున్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని పార్టీ నేతలు, అభ్యర్థులతో ఎన్నికల నేపథ్యంలో సమీక్షిం చారు. జిల్లాలో రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలు బాగా పుంజుకున్నాయి. మంచి జోష్‌లో ఉన్నాయి. మిగతా చోట్ల ఇంకా వేగవంతం చేయాలి.. అందరినీ కలుపుకుని పోవాలని సూచించారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి కూటమి అభ్యర్థి, టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ హాజరయ్యారు. మీ కోఆర్డినేషన్ బాగుందని ఆయన చెప్పడం గమనార్హం. రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శుక్రవారం రాయుడుపాకల గ్రామం నుంచి ముహూర్తం ప్రకారం ప్రచారం ప్రారంభించడం వల్ల సమావేశానికి హాజరు కాలేదు. కానీ తర్వాత గోరంట్ల, తన కుమార్తె కంఠంనేని శిరీషతో కలిసి వచ్చి చంద్రబాబును కలిశారు. అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. టీడీపీ తొలిజాబితాలోనే అభ్యర్థిగా ఉన్న ఆయనకు తర్వాత సమస్య వచ్చి పడిన సంగతి తెలిసిందే. కానీ చంద్రబాబు ఆయనతో నవ్వుతూ మాట్లాడుతూ రెండు రోజుల్లో మీ సమస్య పరిష్కారమవుతుందని చెప్పడం గమనార్హం. ఇక్కడ బీజేపీ సీటు వదులుకోవడానికి బదులుగా వేరే జిల్లాలో మరో సీటు తీసుకోవడానికి అంగీకరించినట్టు సమాచారం.దీంతో రామకృష్ణారెడ్డి తిరిగి టీడీపీ అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉంది. రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను ఉద్దేశించి మీరింకా అందరినీ కలుపుకుంటూ.. స్పీడ్ పెంచాలని చెప్పారు.దీంతో ఆయన మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర ముందుకు వస్తే చాలా మేలు జరుగుతుందని చెప్పినట్టు సమాచారం. తాను మాట్లాడతానని చంద్రబాబు చెప్పడం గమనార్హం. ఇక కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కింగ్‌మేకర్ పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమనేని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పాల్గొన్నారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాజీ మంత్రి కెఎస్ జవహర్ పాల్గొన్నారు. ఇక్కడ చంద్రబాబు మాట్లాడుతూ జవహర్ తన సీటును త్యాగం చేశారు. కొవ్వూరులో ఆయనను కలుపుకోవాలి. ప్రతి దాంట్లోనూ ఆయన ఫొటో కూడా ఉండాలని సూచించడం గమనార్హం. జవహర్ రాజమహేంద్రవరం కేంద్రంగా అన్ని నియోజకవర్గాల్లో పాల్గొంటారని కూడా చెప్పారు. నిడదవోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు హాజరయ్యారు. ఇక్కడ ఇంకా అందరినీ కలుపు కుని వెళ్లాలని.. మరింత వేగం పుంజుకోవాలని సూచించడం గమనార్హం. అమలాపురం, ముమ్మిడివరం జనసేన ఇన్‌చార్జిలు పార్టీ మారడంపై దుర్గేష్ ప్రస్తావించగా త్వరలో అక్కడ పార్టీ ఇన్‌చార్జిలను పెట్టడం అవసరం అని చంద్రబాబు చెప్పారు. అంతేకాకుండా త్వరలో తాను, పవన్ కలసి అమలాపురం, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఉమ్మడిగా రోడ్ షోలు నిర్వహిస్తామని చెప్పా రు. గోపాలపురం నుంచి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు హాజరుకాగా ఇక్కడ బాగానే ఉంది.కానీ ఇంకా అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని చెప్పడం గమనార్హం. అసంతృప్తిగా ఉన్న బాపిరాజుతో తాను మాట్లాడతానని చెప్పడం గమనార్హం. తర్వాత ముళ్లపూడి బాపిరాజుతో కూడా చంద్రబాబు మాట్లాడారు. ఇది పార్టీ నిర్ణయం అందరూ కలసి పనిచేసి ముందుకు వెళ్లాలని బాపిరాజుకు సూచించగా, తాను ఇక్కడ పనిచేయనని, వేరే నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తానని చెప్పడం గమనా ర్హం. అలా కుదరదు పార్టీకోసం పనిచేయాలని చంద్ర బాబు సూచించారు. చంద్రబాబు వెళ్లిపోయిన తర్వాత బాపిరాజు తన అనుచరులతో మాట్లాడుతూ నేను పార్టీ లోనే ఉంటాను. కానీ ఇక్కడ ప్రచారం చేయను. మిమ్మల్ని ఎవరినీ చేయవద్దని చెప్పను. మీ ఇష్టం అని చెప్పడం గమనార్హం.అందరూ అందరికీ కలుపుకుని ముందుకు వెళ్లాలని అందరికీ ఆయన సూచనలు చేశారు. ఇదిలా ఉండగా నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. బయటకు వచ్చిన తరువాత మాట్లాడుతూ పోటీచేయడం ఖాయం.. ఎక్కడి నుంచి అనేది సాయంత్రానికి తేలుతుందన్నారు. అనంతరం చంద్రబాబు సమక్షంలో పాలకొల్లులో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు.టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాలో పర్యటన విజయవంతం కావడంతో టీడీపీ జనసేన,బిజెపి కూటమిలో జోష్ పెరిగింది. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో జరిగిన ప్రజాగళం సభలు బాగా సక్సెక్ కావడం, అన్నివర్గాల ప్రజలు భారీగా హాజరు కావడంతో ఆనందం పెరిగింది. గురువారం రాత్రి నల్లజర్లలోనే బస చేసిన చంద్రబాబు శుక్రవారం జిల్లా నేతలు, అభ్యర్థులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. అసంతృప్తులను బుజ్జగించడంతో పాటు ఆయా అభ్యర్థులకు కూడా అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. చంద్రబాబు పర్యటనతో వీరందరిలో కూడా ఉత్సాహం పెరిగింది. ఇక ప్రచారం హోరు పెరగనుంది. బీజేపీ అభ్యర్థి పురందేశ్వరి ఎన్నికల కార్యాలయం శనివారం ప్రారంభంకానుంది.



నల్లజర్లలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న మహిళా నాయకులు

టీడీపీదే అనపర్తి సీటు?

అనపర్తి, ఏప్రిల్ 5 : అనపర్తి సీటుపై నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చినట్టు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు.అనపర్తిలో టీడీపీ పోటీ చేస్తుందని ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చినట్టు చెప్పారు. త్వరలోనే ప్రకటన వెలువడుతుందని ప్రకటించారన్నారు.శుక్రవారం నల్లజర్లలో జరిగిన టీడీపీ పార్లమెంటరీ రివ్యూ అనంతరం తాను చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయినట్టు తెలిపారు. ఎన్డీఏ గెలుపే లక్ష్యంగా కొన్ని సీట్లు మార్పు అనివార్యంగా మారిందని..అనపర్తి సీటు కూడా మార్పు చేస్తున్నట్టు తెలిపారన్నారు.దీంతో అనపర్తి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లువిరుస్తుంది.



పాలమూరులో సైకిల్‌పై న్యాయం కోసం నల్లమిల్లి యాత్ర చేస్తున్న రామకృష్ణారెడ్డి



నల్లజర్లలో శుక్రవారం చంద్రబాబును కలిసి బయటకు వస్తున్న నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు

ఏం తమాషాలు చేస్తున్నారా.. సస్పెండ్ చేస్తా..!

మద్దిపాటి మాకొద్దంటూ బాబు కాన్వాయ్ అడ్డుకున్న నాయకులపై ఆగ్రహం



పార్టీలోనే ఉంటా : బాపిరాజు

తాను టీడీపీలోనే కొనసాగుతానని గోపాలపురం నియోజక వర్గ అభ్యర్థి మద్దిపాటికి తాము సహకరించలేనని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు.చంద్రబాబు వెళ్లిన తరువాత ప్రియాంక కన్వెన్షన్‌లో తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేశారు. తాను సహకరించేది లేదని ఎవరికైనా ఇష్టం ఉంటే సహకరించవచ్చని తెలిపారు.తాను మరో పార్టీకి వెళ్లే అవసరం లేదన్నారు.



నల్లజర్ల,ఏప్రిల్ 5 : మద్దిపాటి మాకొద్దు ఎవరైనా ముద్దు అనే ఫ్లకార్డులతో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు వర్గీయులు చంద్రబాబు కారును అడ్డుకు న్నారు. దీంతో చంద్రబాబు నాయుడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం తమాషాలు చేస్తున్నారా.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తా.. జాగ్రత్తగా ఉండండి అనే హెచ్చరించారు.చంద్రబాబు హెచ్చరించినా అడ్డుకోవడంతో రోప్‌పార్టీ సిబ్బంది,పోలీసులు బలవంతంగా నెట్టివేసి చంద్రబాబు కారును పంపించివేశారు. గోపాలపురం నియోజక వర్గం నాయకులు, బాపిరాజు వర్గీయులు 400 మంది ఫ్లకార్డులు పట్టుకుని మద్దిపాటి మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి,గన్ని వీరాంజనేయులు,బాపిరాజులను చంద్రబాబు పిలిపించి మాట్లాడారు.తాడేపల్లిగూడెం,కొవ్వూరు,గోపాలపురం నియోజక వర్గ అభ్యర్థులను గెలిపించాలని బాపిరాజుకు సూచించారు. తాను కొవ్వూరు,తాడేపల్లిగూ డెం నియోజకవర్గ అభ్యర్థులకు సహకరిస్తానని,గోపాలపురంలో తాను సహకరించలేనని బాపిరాజు చంద్రబాబుకు చెప్పినట్టు సమాచారం.



గోపాలపురం,పోలవరం అభ్యర్థులను మార్చాలని నల్లజర్లలో టీడీపీ నాయకుల నిరసన



రాజమహేంద్రవరంలో పురందేశ్వరికి సన్మానం చేస్తున్న నాయకులు

పురందేశ్వరికి ఘన స్వాగతం

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, ఏప్రిల్ 5 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్‌టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం రాజమహేంద్రవరం వచ్చారు.తొలుత జిల్లాలోకి అడుగుపెడుతూనే ద్వారకాతిరుమల చినవెంకటేశ్వరస్వామిని, వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌కు చేరుకున్నారు.ఈ సందర్భంగా పురందేశ్వరికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశిష్ లాల్, పసలపూడి సుభాష్ చంద్రబోస్, బూరుగుపల్లి వీర రాఘవులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. తొలుత వట్టికూటి ప్రసాద్ బాబు ఫ్రెండ్స్ బృందం పురందేశ్వరి వెంకటేశ్వరరావు దంపతులను ద్వారకాతిరులమలతో కలిసి స్వాగతం పలికారు. రాజమహేంద్రవరంలో శనివారం బీజేపీ, తెలుగుదేశం, జనసేన నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనునున్నారు. అనంతరం జేఎన్ రోడ్డులో ఎన్నికల కార్యాలయం ప్రారంభించనున్నారు. అనంతరం చెరుకూరి వీర్రాజు కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఎన్‌డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో యువనాయకులు వట్టికూటి ప్రసాద్ బాబు, పాలచెర్ల కృష్ణ, మురళీ, బాబీ పాల్గొన్నారు.



పేపరుమిల్లు ఎదుట కార్మికులు, వామపక్ష సంఘాల నాయకుల ధర్నా

పేపరుమిల్లు కార్మికుల నిరసన

వేతన ఒప్పందం అమలుచేయాలని నిరాహారదీక్ష

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: ఏడాదికి రూ.200 కోట్లు నికర లాభాల్లో ఉన్న ఏపీ పేపరుమిల్లు యాజమాన్యం అందులో పనిచేసే 2500 మంది కార్మికుల వేతన ఒప్పందాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పేపరుమిల్లులో 11 యూనియన్లు ఉన్నాయన్నారు. 2017 నుంచి కార్మికులకు వేతన ఒప్పందం చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్మికులు యాజమాన్యానికి ఫిబ్రవరి 24న సమ్మె నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఈ నెల 2 నుంచి సమ్మెలోకి దిగారని చెప్పారు. మిల్లు లోపలే కార్మికులు సమ్మెలో కూర్చున్నారని చెప్పారు. దీనిపై కనీసం అధికార ప్రతిపక్షపార్టీలు స్పందించకపోవడం దారుణమన్నారు. రాజకీయ పార్టీలకు 2500 మంది మిల్లు కార్మికుల ఓట్లు అవసరంలేదా అని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయం చేయకపోతే 10 వేల మంది కార్మికులతో రాజమహేంద్రవరంలో నిరసన ర్యాలీ, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఐఎన్‌టీయూసీ నాయకులు ముళ్ళ మాధవ్, ఐఎఫ్‌టీయూ నాయకులు కే.జోజి , సీఐటీయూ నాయకులు ఎస్ఎస్.మూర్తి ,బి.రాజులోవ పాల్గొన్నారు.

చిన్నారుల ప్రాణాలతో.. ఆటలా!



రోజంతా పలు ప్రైవేటు పాఠశాలలు

- ఒంటిపూట బడుల ఊసేలేదు
- విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు
- దారెత్తిస్తున్న ఎండలు.. అయినా పట్టని విద్యాశాఖ
- అధికారుల తనిఖీలు లేక యాజమాన్యాల ఇష్టారాజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. 41 డిగ్రీలు దాటి భగభగమంటున్నాయి. పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. కానీ ఇవేమీ విద్యాశాఖకు పట్టనట్లు కనిపిస్తోంది. ఒంటిపూట బడులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు జారీ చేయడంతో సరిపెట్టేసింది. అమలును మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా రోజంతా తరగతులను నిర్వహిస్తున్నాయి. పది మూల్యాంకనం(స్పాట్) ఉండడంతో అధికారులు దానిపై దృష్టి సారించారు. దీంతో పర్యవేక్షణ కొరవడి ప్రైవేటు పాఠశాలల తీరు సందట్లో సడేమియాగా ఉంది.ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో పాఠశాలల్లోని ఫ్యాన్ల నుంచి, కిటికీల్లోంచి వచ్చే గాలి కూడా వేడిగానే ఉంటోంది. పిల్లలు కూర్చునే బెంచీలు వేడెక్కిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పిల్లలు నీరసించి కనీసం అన్నం కూడా తినలేని నిస్సత్తువతో ఇబ్బంది పడుతున్నారు.

ప్రైవేటు నిర్లక్ష్యం..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 986, ప్రైవేటు /కార్పొరేటు పాఠశాలలు 587 ఉన్నాయి. గత నెల 18 నుంచి ఏప్రిల్ 23 వరకూ ఒంటిపూట బడుల షెడ్యూల్ విడుదల చేశారు. పది పరీక్షలు గత 18వ తేదీ నుంచి మొదలు కావడంతో పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూల్స్ ఒంటిపూట బడుల సమయాలను పరీక్షలు ముగిసే వరకూ మార్పు చేశారు. పరీక్షా కేంద్రం లేని స్కూల్స్‌లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, పరీక్షా కేంద్రం ఉన్న చోట మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహించేలా ఉత్తర్వులిచ్చారు. పది పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచి అన్ని స్కూల్స్‌లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకూ మాత్రమే తరగతులు నడవాల్సి ఉంది. ఈ సమయాలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాటించాలి. కానీ కొన్ని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు ఉత్తర్వులు తమకు వర్తించవన్నట్టు ప్రవర్తిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనమైన తర్వాత పిల్లలను ఇంటికి పంపేస్తున్నారు. కానీ అధికశాతం ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం వరకూ విద్యార్థులను ఇళ్లకు పంపించడం లేదు.అధికారులు కూడా చూసీచూడకుండా వదిలేయడంతో రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు వారాల నుంచి పలు కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలల్లో రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులకు మాత్రం తెలియక పోవడం చిత్రమని తల్లిదండ్రులు అంటున్నారు.రెండు పూటలా బడులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ రెండు రోజుల కిందట జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు ఉత్తర్వులిచ్చారు.కానీ ఫలితం మాత్రం కానరాలేదు. విద్యార్థులకు ఎండదెబ్బ తగిలితే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చే సరికి నీరసించిపోతున్నారని ఆవేదన చెందుతున్నారు.

95.44 శాతం పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్ల పంపిణీ 3 రోజుల్లో 95.44 శాతం పూర్తయింది.ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం.. జిల్లాలో 2,43,831 మంది లబ్ధిదారులు ఉండగా శుక్రవారం సాయంత్రానికి 2,29,813 మందికి పింఛను అందజేశారు. మొత్తానికి 95.44 శాతం పూర్తయింది. నల్లజర్ల మండలంలో అత్యధికంగా 96.41 శాతం పంపిణీ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం సాయంత్రం నల్లజర్లలో 'ప్రజాగళం' నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ మండలంలో అధికశాతం పంపిణీ జరగడం గమనార్హం. ఇంటింటికీ కూడా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 5: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను భావిత రాలకు అందించడమే నిజమైన నివాళి అని కలెక్టర్ డా.కె.మాధవీ లత అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించు కుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానత్వంతో ఉండాలనే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాల విద్య విషయంలో అత్యంత ప్రాధా న్యతను ఇచ్చారన్నారు. బాబు జగ్జీవన్‌రామ్‌ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలోని పిల్లలను బాగా చదివించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ జగదీశ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ మార్గాన్ని,ఆదర్శాలను, సంస్కరణలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.సం దీప్,అడిషనల్ ఎస్పీలు పి.అనీల్‌కుమార్, రాజశేఖర్ రాజు, టి.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి,డీఎస్పీ డి.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ నూరి అప్పారావు పాల్గొన్నారు.


కేరళ వాయిద్య బృందం ప్రదర్శన

ఆత్రేయపురం, ఏప్రిల్ 5: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్స వాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజైన శుక్రవారం ఉదయం వసంత మండపంలో చతు ర్వేద పారాయణ, ద్రవిడ వేద పారాయణలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం మేళతాళ మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి పల్లకి మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహిం చారు. వాయిద్య కళాకారుల ప్రదర్శనలు భక్తు లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. రాత్రి చంగోలం పారాయణం జరిపారు. ఈవో భూపతిరాజు కిషో ర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వాడపల్లిలో ఘనంగా ప్రారంభమైన
అధ్యయనోత్సవాలు



- చతుర్వేద పారాయణం, ద్రవిడ వేద పారాయణం నిర్వహించిన వేద పండితులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు


స్వామివారి పల్లకి మహోత్సవం

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్

- అక్కడికక్కడే యువకుడి మృతి
- గాయాలతో బయటపడ్డ మరొకరు




శ్రీరామ్ (ఫైల్‌ఫొటో)

ముమ్మిడివరం/అంబాజీపేట, ఏప్రిల్ 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ బొండా యికోడు సమీపంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. అపోలో ఫార్మశీలో పని చేస్తున్న అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రా మానికి చెందిన నక్కా శ్రీరామ్ (32), అయినవిల్లి మండ లం నేదునూరుకుచెందిన నక్కా శ్రీనివాస్ మోటారు సైకి ల్‌పై కాకినాడలో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి వస్తున్నారు. బొండాయికోడు సమీపంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని వారు ఢీకొన డంతో శ్రీరామ్ అక్కడికక్కడే మృతి చెం దగా శ్రీనివాస్ గాయాలతో బయటపడ్డా డు. క్షతగాత్రుడిని అంబులెన్సులో ము మ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. శ్రీరామ్ మృతితో పుల్లేటికుర్రు నక్కావారిపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడంతో తండ్రి తాతారావు, తల్లి మేరీ, కుటుంబ సభ్యులు బోరున విలపిం చడం చూపరులను కంటతడి పెట్టించింది.

పవన్ రెండో విడత పర్యటన ఖరారు

- 9న పిఠాపురంలో జరిగే ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని



పిఠాపురం, ఏప్రిల్ 5: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రెండో విడత పర్యటన ఖరారయింది. ఉగాది రోజున ఆయన పిఠాపురంలో ఉండనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నాలుగురో జులు పర్యటించి ఈనెల 2వ తేదీ రాత్రి విజయవాడ వెళ్లిన పవన్‌కల్యాణ్‌కు తీవ్ర జ్వరం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. మూడు రోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ఆయన హైదరాబాద్‌కే పరిమిత మయ్యారు. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత ప్రచార షెడ్యూల్‌ను ఖరా రు చేశారు. 7వ తేదీన అనకాపల్లి, 8వ తేదీన యలమంచిలిలో పర్యటించి అక్కడ బహిరంగ సభల్లో పాల్గొనను న్నారు. అనంతరం 9వ తేదీన పిఠాపు రం నియోజకవర్గంలో జరిగే ఉగాది వేడుకల్లో పవన్ పాల్గొంటారు. 9వ తేదీ అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేస్తా మని జనసేన వర్గాలు తెలిపాయి. రెండో విడత పర్యటనలో భాగంగా పవన్ పిఠా పురం వచ్చి ఉగాది వేడుకల్లో పాల్గొన నుండటంతో జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

వైసీపీ సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలరు సస్పెన్షన్

రాయవరం, ఏప్రిల్ 5: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వైసీపీ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రేషన్ డీలరును తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ గురువారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయ వరం మండలం మాచవరానికి చెందిన 17వ నెంబరు రేషన్ డీలర్ కత్తుల అప్పారావు గత నెల 30న గ్రామంలో వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ విషయమై పలువురు ఆర్వోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణ జరిపి నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. వాటి ఆధారంగా డీలర్‌పై సస్పెన్షన్ విధించారు. ఆ రేషన్ దుకాణంలోని స్టాకును 14వ నెంబరు రేషన్ డీలర్‌కు ఎంఎస్‌వో ఆలీషా శుక్రవారం అప్పగించినట్టు తహసీల్దారు ఆర్వీ కృష్ణారావు తెలిపారు.

రూ.2.64 లక్షలు సీజ్


డబ్బును సీజ్ చేసిన అధికారులు

పి.గన్నవరం, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం నాగుల్లంకలో వాహనాల తనిఖీల్లో భాగంగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.2.64 లక్షలు సీజ్ చేసినట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎస్‌జేవీ రామమో హనరావు తెలిపారు. ఏపీ05ఎఫ్‌ఏ0444 కారు లో మట్టపర్తి సోమశేఖర్‌కు చెందిన రూ.1.95 లక్షలు, ద్విచక్ర వాహనంలో కొంపెల్ల శ్రీరామ సుబ్రహ్మణ్యానికి చెందిన రూ.69 వేలు గుర్తిం చామన్నారు. వాటికి ఏ విధమైన ఆధారాలూ చూపకపోవడంతో సంబంధిత నగదును సీజ్ చేసి రెవెన్యూ అధికారుల పంచనామా అనంతరం తదుపరి చర్యల నిమిత్తం పోలీసులకు అప్పగించినట్టు రామమోహనరావు చెప్పారు.

రూ.1.38 లక్షలు సీజ్


తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

సామర్లకోట, ఏప్రిల్ 5: సామర్లకోట ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్ సమీపాన పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కెవీఆర్ గుప్త, ఇతర అధికారులు శుక్రవారం సాయ ంత్రం పలు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా ఏడీబీ రోడ్డులో స్కూటర్ డిక్కీలో దాచి ఉంచిన ఎటువంటి బిల్లులు, ఆధారాలు లేని సుమారు రూ.1.38 లక్షల నగదును స్క్వాడ్ అధి కారులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. పూర్తి నివే దికలను జిల్లా ఎన్నికల అధికారికి అందజేసి తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మండపేటలో రేషన్ బియ్యం స్వాధీనం

మండపేట, ఏప్రిల్ 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో రూ.72 లక్షలు విలువ చేసే రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... మండపేట పట్టణంలోని సైదిల్‌పేటకు చెందిన పెరుమళ్ల రాంబాబు ఒక్కొక్కటీ 50 కిలోల చొప్పున 76 బస్తాలను అక్రమంగా నిల్వ చేశాడు. రెవెన్యూ అధికారులు, పోలీసులు దాడి చేసి రేషన్ బియ్యంగా నిర్ధారించి సీజ్ చేశారు. రేషన్ బియ్యం సంచులు సీలు విప్పకుండానే నేరుగా వ్యాపారి వద్ద లభ్యం కావడంతో అధికారులు అవాక్కయ్యారు. పట్టుబడ్డ బియ్యాన్ని స్థానిక సివిల్ సప్లయిస్ గోదాముకు తరలించారు. వ్యాపారిపై కేసు నమోదు చేసినట్టు డిప్యూటీ తహసీల్దారు అలీషా తెలిపారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం

రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో
క్యూఆర్ కోడ్



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని సాధారణ టికెట్ల(అన్ రిజర్వుడు)ను క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లించి తీసుకోవచ్చు. ఈ మేరకు సాధారణ టికెట్ కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని విజయవాడ రైల్వే డివిజన్‌లోని విజయవాడ, ఏలూరు, తెనాలి, రాజమండ్రి రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి తెచ్చారు. టికెట్లు తీసుకునే సమయంలో చిల్లర సమస్యను అధిగమించడంతో పాటు నగదు లావాదేవీలను తగ్గించడంలో భాగంగా డిజిటల్ సౌకర్యాలను మెరుగు పరుస్తున్నామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏం చేశారని ఓట్లు అడగడానికి వచ్చారు..?

- ముమ్మిడివరం వైసీపీ అభ్యర్థి పొన్నాడను నిలదీసిన మహిళలు

తాళ్లరేవు, ఏప్రిల్ 5: ముమ్మిడివరం వైసీపీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ తన సామాజికవర్గానికి తప్ప ఇతర వర్గాలకు ఏం చేశారని రాఘవేంద్రపురం మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం పటవల పంచాయతీ రాఘవేంద్రపురం గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మహి ళలు మాట్లాడుతూ ఎమ్మెల్యే వస్తున్నారని డ్రైనేజీలకు బ్లీచింగ్ కొట్టారని, పురుగులతో కుళాయినీరు సరఫరా అవుతుందని తాగలేకపోతున్నామన్నారు. ఓఎన్‌జీసీ డబ్బులు మత్స్యకారులకే ఇస్తున్నారు తప్ప ఇతరులకు ఇవ్వడం లేదని తమ ఓట్లు మాత్రం కావాలని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళలు సమస్యలను ప్రస్తావిస్తుంటే స్థానికేతర కార్యకర్తలు ఎదురుదాడికి దిగి అక్కడ నుంచి జారుకున్నారు.


పొన్నాడను ప్రశ్నిస్తున్న మహిళలు

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష


విరాళం అందిస్తున్న దాతలు

అన్నవరం, ఏప్రిల్ 5: అన్నవరం దేవస్థానంలో ప్రతి ష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథ కానికి శుక్రవారం భీమవరానికి చెందిన ఎస్.కె.జీ కృష్ణం రాజు రూ.1,11,116 విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఏపీఆర్వో గణపతికి అందచేయగా దాతను ఆయన అభినందించి స్వామివారి ప్రత్యేక ద ర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

ప్రేమజంట ఆత్మహత్య

- ఇంట్లో అంగీకరించరనే భయంతో గడ్డిమందు తాగిన వైనం
- అపస్మారక స్థితిలో రోడ్డుపక్కన పడి ఉన్న యువకుడు, బాలిక
- ఆస్పత్రికి తరలింపు.. చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి
- అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఘటన..


అశోక్

ఏలేశ్వరం/నర్సీపట్నం, ఏప్రిల్ 5: కాకినాడ జిల్లా ఏలేశ్వరం ప్రాంతానికి చెందిన ప్రేమజంట (బాలిక, యువకుడు) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఇందుకు సంబంధించి అనకాపల్లి జిల్లా నర్సీపట్నం రూరల్ పోలీసులు, ఏలేశ్వరం వాసులు అందించిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం పట్టణంలోని పెద్దవీధికి చెందిన తాండ్రాజు అశోక్ (25), ఏలేశ్వరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) ప్రేమించుకుంటున్నారు. కాగా పెద్దలు తమ ప్రేమను అంగీకరించరనే భయంతో నాలుగురోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయారు. అప్పటినుంచి వీరు ఫోన్లు అందుబాటులో లేవు. గురువారం అర్ధరాత్రి సమయంలో బాలిక ఫోన్ ఆన్ చేయగా ఇంటినుంచి కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. దీంతో ఏం జరుగుతుందోననే ఆందోళనతో.. తమను విడదీస్తారేమోనన్న భయంతో వారిద్దరూ శుక్రవారం తెల్లవారుజామున గడ్డిమందు తాగారు. నర్సీపట్నం మండలం కృష్ణాపు రం సమీపంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్నారు. వీరిని బీట్ కానిస్టేబుల్ గమనించి హ టాహుటిన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. యువకుడు చేతిపై రాసుకున్న ఫోన్ నెంబర్ ఆ ధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు అశోక్‌ను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. బాలికను కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా మార్గమధ్యంలోనే ఆమె మృతిచెందింది. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందినట్టు నర్సీపట్నం రూర ల్ పోలీసులకు సమాచారం అందింది.

డిజిటల్ అసిస్టెంట్‌కు రిమాండ్

- కత్తులతో మహిళను బెదిరించి మెడలో బంగారు గొలుసు అపహరణ

తొండంగి,ఏప్రిల్ 5: కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏవీ నగరం గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శీలం అజయ్ కుమార్ అనే వ్యక్తి తొండంగి మండలం బుచ్చియ్య పేట గ్రామానికి చెందిన అంబుజాలపు దేవి అనే మహిళ ను కత్తుల తో బెదిరించి మెడలో బంగారు గొలుసును దొంగిలించిన కేసులో అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించినట్లు తొండంగి పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం యు. కొత్తపల్లి మండలం శీలంవారిపాకలు గ్రామానికి చెందిన శీలం అజయ్ కుమార్ అనే వ్యక్తి ఏవీ నగరం గ్రామంలో డి జిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. బెట్టింగ్ వంటి చెడు వ్యసనాలకు బానిసై సుమారు 15 లక్షల రూపాయలు అప్పు చేయడంతో పాటు సచివాలయ డైలీ సర్వీసు మొత్తం 45 వేల రూపాయలు వాడుకున్నాడు. వీటిని తీర్చడానికి దొంగతనాలకు పాల్పడ్డానికి సిద్ధమయ్యాడని పోలీసులు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటైన ఎఫ్ఎస్టీ బృందంలో సభ్యునిగా ఉంటూ దీనిని ఆసరాగా తీసుకుని ఓటు వివరాల కోసం వచ్చానని చెప్పి పగటిపూట ఒంటరిగా ఉండే మహిళల వివరాలు తెలుసుకుని అజయ్‌కుమార్ నేరానికి పాల్పడ్డారన్నారు. ఈ నెల రెండో తేదీన సుమారు ఒంటిగంట ప్రాంతంలో బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన అంబుజాలపు దేవి అనే మహిళ మెడపై కత్తులు పెట్టి బెదిరించి మెడలో మూడు తులాల మంగళ సూత్రాలను దోచుకు వెళ్లాడన్నా రు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసా మన్నారు. అతని నుంచి బెదిరించడానికి ఉపయోగించిన కత్తులు, దోచుకు వెళ్లిన మూడు తులాల మంగళ సూత్రాల తాడు, నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీన పర్చుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు.

తెలంగాణ సీఎస్ పూజలు


స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

అన్నవరం, ఏప్రిల్ 5: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతకు మారి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమెకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలు అందజేశారు.

శిశుగృహలో 56 రోజుల బాలుడి మృతి

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 5: కాకినాడ శిశు గృహలో 56 రోజుల వయస్సు ఉన్న మగ బిడ్డ మృతిచెందిన సంఘటన కలకలం రేపింది. బుధవారం అర్ధరాత్రి చిన్నారి తీవ్ర ఆయాసంతో శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడడంతో వెంటనే శిశుగృహ సిబ్బంది కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చిన్నారిని పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధా రించారు. శిశుగృహ నిబంధనల ప్రకారం చిన్నారికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘ టనపై జిల్లా కలెక్టర్ పూర్తిస్థాయిలో ఆరా తీశారు. శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న మిగి లిన నలుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలకు శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విచారణ పూర్తయిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గుంటూరుకు చెందిన తల్లిదండ్రులు తమ రెండు నెలల మగశిశు వును కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన భార్యాభర్తలకు అనధికారికంగా దత్తత ఇచ్చారు. ఈ మేరకు వారి నుంచి రూ.లక్ష తీసుకున్నట్లు సమాచారం. శిశువు దత్తత విషయంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు గుంటూరు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కాకినాడ జిల్లా ఐసీడీఎస్ అధికారులు పోలీసుల సమక్షంలో మార్చి 15న కిర్లంపూడిలో బిడ్డను స్వాధీనం చేసుకున్నారు. కాకినాడలోని శిశుగృహకు తరలించి అక్కడే ఆశ్రయం కల్పించారు. అప్పటినుంచి శిశుగృ హలో ఉన్న ఆ శిశువు బుధవారం మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది.


వలకు చిక్కిన టేకులు


మత్స్యకారుల వలకు చిక్కిన టేకులు

అంతర్వేది, ఏప్రిల్ 5: సఖినేటిపల్లి మండలం అంత ర్వేది మినీ ఫిషింగ్ హార్బరులో శుక్రవారం మత్స్యకారుల కు రెండు పంతాల టేకులు చేపలు చిక్కాయి. రేవులో జ రిగిన వేలంలో వాటిని రూ.15 వేలకు కొనుగోలు చేశా రు. టేకులు ధర తక్కువ అయినప్పటికీ తినేందుకు రు చిగా ఉంటాయని కొనుగోలుదారులు చెప్పారు.

ఎండ తీవ్రతకు బయటకు వస్తున్న సర్పాలు

- ఇందుపల్లిలో ఇంటిలోకి చొరబడ్డ గోధుమతాచును పట్టుకున్న స్నేక్ క్యాచర్


పామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ

అమలాపురం రూరల్, ఏప్రిల్ 5: వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండడం తో విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి చొరబ డుతున్నాయని స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ తెలి పారు. ఉష్ణ తాపం తట్టుకోలేక పొలాల్లో ఉం డే పాములు ఇళ్లల్లోకి చేరుతున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ ఇందుపల్లిలోని పెదమ ల్లు లింగేశ్వరరావు ఇంట్లోకి శుక్రవారం చొరబ డిన గోధుమ తాచును గణేష్‌వర్మ పట్టుకు న్నాడు. పర్యావరణానికి మేలుచేసే సర్పాలను చం పవద్దని ఆయన కోరారు. సర్పాలు కనిపించిన వెం టనే తనకు ఫోన్ చేస్తే వచ్చి వాటిని బంధించి నిర్జ న ప్రదేశంలో విడిచి పెడతానని చెప్పారు. వివరాలకు 9949956232 నెంబరును సంప్రదించా లన్నారు.

వివాహేతర సంబంధం అనుమానంతో వ్యక్తిపై కత్తితో దాడి

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 5: వివాహేతర సంబంధం అనుమానంతో చినజగ్గంపేటకు చెందిన సారిపల్లి అప్పలరాజుపై అదే గ్రామానికి చెందిన గుళ్ల ఏసుబాబు శుక్రవారం రాత్రి కత్తితో దాడి చేశాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. తన భార్యను వేధిస్తున్నట్లు 6నెలల క్రితం గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో అప్పలరాజుపై ఏసుబాబు ఫిర్యాదు చేయగా విచారణలో రుజువు కాకపోవడంతో కేసు నమోదు చేయలేదు. అప్పటినుంచి ఏసుబాబు కక్షగట్టినట్లు చెబుతున్నారు. శుక్రవారం రాత్రి అప్పలరాజు అతడి స్నేహితుడు సారిపల్లి శ్రీను కుప్ప నూరుపు కూలికి వెళ్లి బరకాలు అప్పజెప్పడానికి మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా వెనకనుంచి గుల్ల ఏసుబాబు కత్తి పట్టుకుని వెంబడించి రెండు చోట్ల గాయపరిచాడు. సారిపల్లి శీను అడ్డగించి కత్తి లాక్కోబోతుండగా కత్తిని కింద పడేసి ఏసుబాబు పరారయ్యాడు. అప్పలరాజును సీఐ శ్రీనివాస్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వివాహేతర సంబంధం ఉందన్న అనుమానమే ఈ సంఘటనకు కారణంగా చెబుతున్నారు.

ఏజెన్సీ సమాచారం



కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తిప్రదాత

రాజవొమ్మంగి ఏప్రిల్ 5: ఎమ్మార్పీఎస్ మండలం ప్రెసిడెంట్ మోర్త బుజ్జిబాబు ఆధ్వర్యంలో రాజవొమ్మంగి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కేక్ కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ ప్రెసిడెంట్ మోర్త బుజ్జిబాబు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ గొప్ప పోరాట యోధునిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. అయినవెళ్లి తాతారావు, గుండేపల్లి జీవరత్నం, బోడపాటి కామరాజు, పెదపూడి లోవరాజు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో వేడుకలు

రాజవొమ్మంగి ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ వాస సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

మోతుగూడెం, ఏప్రిల్ 5: మోతుగూడెంలో శుక్రవారం ఏపీ ఎస్సీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ ఘన నివాళులర్పించారు. ఏపీ ఎస్సీ, బీసీ, ఎస్టీ అసోసియేషన్ సభ్యులు ఏడీఈ కృష్ణకుమార్, ఏఈ నరసింహారావు, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్, పీటీ రామారావు, జి.రవి ఉపేంద్ర, ధారబాబు, సెల్వరాజు, అచ్చయ్య పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన సదస్సు

దేవిపట్నం,ఏప్రిల్ 5: మండలంలోని ఇందుకూరు పీహెచ్‌సీలో శుక్రవారం సికిల్‌సెల్, వడదెబ్బలు, గర్భిణీల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ఆరోగ్య శాఖ అవగాహన సదస్సు నిర్వహించింది. హెల్త్ ఎడ్యుకేటర్ పి.ఝాన్సీరాణి, పీహెచ్‌సీ వైద్యాధికారి టి.డేవిడ్ ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఇబ్బందులు పడకుండా గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దేశ వ్యాప్తంగా సికిల్‌సెల్ వ్యాధిని అరికట్టడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో కోసు శ్రీనివాస్, పీహెచ్ఎన్ విజయకుమారి, రమణ, వసంత, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

‘కష్టపడే వారికే టికెట్ ఇవ్వాలి’

కూనవరం, ఏప్రిల్ 5: టీడీపీలో అనునిత్యం కష్టపడి పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన వారికే టికెట్ కేటాయిస్తే విజయం తథ్యమవుతుందని కూనవరం మండలంలోని టీడీపీ సర్పంచ్‌లు అన్నారు. విలేకర్లతో శుక్రవారం వారు మాట్లాడుతూ పార్టీ ఎదుగుదలకు పనిచేసిన వంతల రాజేశ్వరికి టిక్కెట్ ఇస్తే బాగుంటుందని తమ అభిప్రాయమని కానీ కొంత మంది దీన్ని సాకుగా చూపెట్టి తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారన్నారు. తమ ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే కొనసాగుతామని చంద్రబాబు ఎవరికి బీ ఫామ్ ఇస్తే వారి గెలుపునకు తాము సర్వశక్తులా ఒడ్డుతామన్నారు. కాచవరం సర్పంచ్ నూడిపాక సాయిరమణ, పోతవరం సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, తోటకూరి వెంకటేశ్వరరావు, సింగయ్య, రత్తయ్య, శివయ్య పాల్గొన్నారు.

బాబును కలిసిన ‘వంతల’



రంపచోడవరం, ఏప్రిల్ 5: తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడును రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి శుక్రవార కలిశారు. తూర్పుగోదావరి జిల్లా పర్యటనలో భాగంగా నల్లజర్ల వచ్చిన బాబును వంతల కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

నేడు టీడీపీ లీగల్ రాష్ట్ర వర్క్‌షాప్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్-2 పరిధిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వర్క్‌షాప్‌ను రాజమహేంద్రవరం గన్నిస్ శుభమస్తులో శనివారం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నామని పార్టీ లీగల్ సెల్ ఇన్‌చార్జి గన్ని కృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ వర్క్‌షాప్‌నకు లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పి.కృష్ణమోహన్, జోన్-2 ఇన్‌చార్జులు సుజయ కృష్ణ రంగారావు, మందలపు రవి, కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, న్యాయవాదులు హాజరవుతారని చెప్పారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల
- కొత్తపల్లిలో 1000 కుటుంబాలు టీడీపీలో చేరిక



రాయుడుపాకలు వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 5: వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వనాశనం చేశారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కోలమూరు పంచాయతీ పరిధిలోని రాయుడుపాకల నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించారు. ముందుగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో వరసిద్ధి వినాయకుడి ఆలయంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం అరుంధతీపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రచారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ దోపిడీ రాజ్యం, దొంగల ప్రభుత్వానికి ప్రజలు చమరగీతం పాడే సమయం ఆసన్నమైందని, జగన్ తన స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని విధ్వంసం చేయడమే అజెండాగా పెట్టుకున్నాడని విమర్శించారు. పాదయాత్రలో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మబలికాడని, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతరాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలకు వలసలు పెరిగాయన్నారు. కూటమి గెలిస్తే రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం అందరికీ అందుతాయన్నారు. అనంతరం రాయుడుపాకల గ్రామం నుంచి కొంతమూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలకు 2.60 లక్షల మంది జగన్ సైన్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: ఎన్నికల కోసం రాష్ట్రంలో 2.60 లక్షల మంది ప్రైవేట్ సైన్యాన్ని వలంటీర్ల రూపంలో జగన్ సిద్ధం చేసుకున్నాడని టీడీపీ-జనసేన-బీజేపీ నాయకులు ఆరోపించారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జనసేన నగర ఉపాధ్యక్షుడు రాజేష్ ఖన్నా, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా, బీజేపీ నాయకుడు కందికొండ రమేష్ మాట్లాడారు. జగన్ మళ్లీ అధికారంలోకి రాను అని ఫిక్స్ అయ్యి వారి సొంత కాంట్రాక్టర్లకు పెద్దఎత్తున బిల్లులను మార్చి నెలాఖరు నాటికి చెల్లించుకుని రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశాడన్నారు. అందుకే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇచ్చే పింఛన్లకు డబ్బులు లేకుండా చేశాడని మండిపడ్డారు. గతంలో వలంటీర్లు లేకుండానే వ్యవస్థలు పనిచేశాయన్నారు. సమావేశంలో తంగెళ్ల బాబి, బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి బూర రామచంద్రరావు, జనసేన నగర కార్యదర్శి ముమ్మిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అధికారంతోనే రాష్ట్రాభివృద్ధి: వాసు

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి విజయం సాధిస్తే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. 3,42వ డివిజన్లలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కుడుపూడి సత్తిబాబు, జక్కంపూడి అర్జున్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేశారు. తాడేపల్లిగూడెం టీడీపీ పరిశీలకుడు నక్కా చిట్టిబాబుతో కలిసి ఆదిరెడ్డి వాసు ఇంటింటి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ల ప్రదీప్, నాయకులు మళ్ల వెంకట్రాజు, కేవీ శ్రీనివాస్, ఆడారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కూటమిదే అధికారం : జ్యోతుల

గోకవరం, ఏప్రిల్ 5: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారమని, సీఎం జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో వైసీపీకి చెందిన 1000 కుటుంబాలు జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ నెహ్రూ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నెహ్రూ మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎన్నికల్లో ఎన్ని మాయమాటలు చెప్పినా వినే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, జగన్ అరాచక పాలనను పారద్రోలేందుకు రోజులు అతి దగ్గరిలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అలాగే అచ్యుతాపురంలో పలువురు వైసీపీని వీడి నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగరాతి రాము, పాలూరి బోస్, ఉంగరాల రాము, దాసరి తమ్మన్నదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, సాలెపు నల మహరాజు, బదిరెడ్డి రవి, దాసరి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

గాదరాడలో కూటమి ఇంటింటా ప్రచారం

కోరుకొండ, ఏప్రిల్ 5: మండలంలోని గాదరాడలో శుక్రవారం జనసేన-టీడీపీ-బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నర్సాపురంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేనలో చేరారు. వారికి మేడిశెట్టి శివరాం, తోట పవన్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చొంగా కృష్ణ, చొంగా సూరిబాబు, అడ్డాల భద్రం, పెదపాటి పాండవులు, మారిశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



గోకవరం: కొత్తపల్లిలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో నెహ్రూ



రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

మహనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్

- యువత ఆదర్శంగా తీసుకోవాలి
- జయంతి కార్యక్రమంలో ‘నన్నయ’ వీసీ పద్మరాజు



నన్నయ వర్సిటీలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 5: విద్యతోనే ఏసమస్యనైనా అధిగమించగలమని దృఢసంకల్పంతో దేశ చరిత్రలో తనదైన ముద్రవేసుకున్న మహనీయుడు బాబూజగ్జీవన్‌రామ్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. నన్నయ వర్సిటీలో జరిగిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. బాబూజీ జీవితచరిత్రను వివరించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు మహనీయుల జీవితచరిత్రలను విద్యార్థులకు బోధిస్తుండాలని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.సురేష్‌వర్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలో ఎంఎస్పీ మండలాధ్యక్షుడు గరబారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాబూ జగ్జీవన్‌రామ్ సేవలను ఆయన కొనియాడారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో దళిత నాయకులు వరసాల ప్రసాద్, తోలేటి రాంప్రసాద్, బొడ్డుపాటి చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

కడియం: మండలం దామిరెడ్డిపల్లిలో జగజ్జీవనరామ్ యూత్ ఆధ్వర్యంలో బాబూజీ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో తాతపూడి రాంబాబు, చింతపర్తి నాగేశ్వరరావు, చింతపర్తి చిట్టిబాబు, మెరిపే రత్నం, చింతపర్తి ఇస్సాకు, యార్లగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని రామవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తేనెల శ్రీనివాస్, నల్లమిల్లి సుబ్బారెడ్డి, సురేంద్రరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. అనపర్తిలోని జగ్జీవన్‌రామ్ నగర్‌లో టీడీపీ నాయకుడు నూతిక బాబూరావు అధ్యక్షతన జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించి ఆయనకు నివాళులర్పించారు.

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని అరుంధతీపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి టీడీపీ మండలాధ్యక్షుడు మార్శెట్టి శివ సత్య ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. కార్యక్రమంలో పెనుముచ్చి సురేష్, ముప్పిడి రవి, అనంతారపు గోపి, కామిని ప్రసాద్, భీమరశెట్టి రమేష్, యార్లగడ్డ సతీష్, పలివెల సత్యనారాయణ పాల్గొన్నారు.



గోకవరంలో కేక్ కట్ చేస్తున్న ఎంఎస్పీ నాయకులు



బొమ్మూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 9 హామీలు

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



పోస్టర్ విడుదల చేస్తున్న గిడుగు రుద్రరాజు

కడియం, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 9 హామీలు అమలు చేస్తామని ఆపార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతులకు పెట్టుబడికి 50శాతం లాభంతో మద్దతు ధర, పదేళ్ల పాటు ప్రత్యేక హోదా అమలు, పెన్షన్లు పెంపు వంటి హామీలు అమలు చేస్తామన్నారు. శుక్రవారం మండలంలో జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, సీనియర్ నాయకుడు తాడాల కొండ్రాజు, ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళి తదితరులతో కలిసి కడియం, కడియపులంక గ్రామాల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించారు. అనంతరం కొండ్రాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రుద్రరాజు మాట్లాడారు. కర్ణాటకలో 5 గ్యారంటీలు, తెలంగాణాలో 6 గ్యారంటీలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు మనోజ్, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, ముల్లా మాధవ్, మార్టిన్ లూథర్, వులిశెట్టి సత్తిబాబు, జెట్టి రామారావు పాల్గొన్నారు.

పొలమూరులో ‘న్యాయం కోసం నల్లమిల్లి’



పొలమూరులో కుటుంబంతో కలిసి పర్యటిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పొలమూరులో నిర్వహించారు. తల్లి సత్యవతి, భార్య మహాలక్ష్మీ, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె సానతనితో కలిసి పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం చిన పొలమూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పది రోజులుగా తాను చేస్తున్న పోరాటానికి చంద్రబాబు నుంచి భరోసా లభించిందని, అనపర్తి నుంచి టీడీపీ పోటీలో ఉండటం ఖాయమన్నారు. త్వరలోనే ప్రకటన వెలువడుతుందని, శుక్రవారం నల్లజర్లలో జరిగిన టీడీపీ పార్లమెంటరీ రివ్యూ అనంతరం తాను చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయినట్లు నల్లమిల్లి తెలిపారు. ఎన్డీయే గెలుపే లక్ష్యంగా కొన్ని సీట్లు మార్పు అనివార్యమైందని, అనపర్తి సీటును కూడా మార్పు చేస్తున్నట్టు ఆయన తెలిపారన్నారు. ఐదేళ్లుగా వైసీపీ దాష్టికానికి అనేకమంది బలైపోయారని, ఆ పార్టీని అంత మొందించాలన్న లక్ష్యంతో ఏర్పడిన కూటమి విజయం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకర రెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి పాల్గొన్నారు.


కూటమి గెలుపు..బీసీల గెలుపు



బీసీ సంఘాల నాయకులతో సమావేశమైన ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలోని బీసీలు విజయం సాధించినట్లేనని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. స్థానిక 3,4 డివిజన్ల బీసీ నాయకుల సమావేశం శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగింది. దీనికి ఆదిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. 50 ఏళ్లకే పింఛన్లు, బీసీల సంక్షేమానికి రూ1.50 లక్షల కోట్లు కేటాయింపులు, కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్, బీసీల రక్షణ చట్టం వంటి పథకాలు అమలు కావాలంటే కూటమి అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, తాడేపల్లిగూడెం పరిశీలకుడు నక్కా చిట్టిబాబు, నక్కా దేవీవరప్రసాద్, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి, యాళ్ల శ్రీనివాసరావు, అహ్మద్ మునీషా, కొండపల్లి శ్రీదేవి, కుడుపూడి సరోజిని, సాగి నాగమణి పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠకు హాజరైన స్వామీజీలు

కొవ్వూరు, ఏప్రిల్ 5: కొవ్వూరులోని బసివిరెడ్డిపేటలో రాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవగుప్తాపు లక్ష్మణరావు, ఆలయార్చకులు గొడవర్తి సత్యనారాయణాచార్యులు, వేణుగోపాలచార్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

- గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటా రూ.2,203, గ్రేడ్-బి రూ.2,183
- వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి



నామవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

రాజానగరం, ఏప్రిల్ 5: మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ శ్రీని వాసరెడ్డి పిలుపునిచ్చారు. రబీ సీజన్‌కు సంబంధించి మండలంలోని నామవ రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా, తాము పండించిన ధాన్యాన్ని నేరుగా రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. మండలంలో నామవరంతో పాటు సంపత్‌నగరం, కలవ చర్ల, నందరాడ, సీతారాంపురం, నరేంద్రపురం-1, పాలచర్ల, ముక్కినాడ, కాన వరం, రాజానగరం-1; తోకాడ-1, వెలుగుబంద-1; కొత్తతుంగపాడు, జి.యర్రం పాలెం, కొండగుంటూరు, పాతతుంగపాడు గ్రామాల్లో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రేడ్-ఏ (ఫైన్ వెరైటీస్, ఆర్ఎన్ఆర్ 15048) రకం ధాన్యం క్వింటాల్ ధర రూ.2,203 కాగా, గ్రేడ్-బి(కామన్ వెరై టీస్, ఎంటీయూ1121) రకం ధాన్యం క్వింటాల్ రూ.2,183 ధర నిర్ణయించినట్టు చెప్పారు. వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం మాట్లాడుతూ తొలిరోజు సేకరణలో భాగంగా కొత్తతుంగపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో 334 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 60 రోజులపాటు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని రైతులు వినియోగించుకోవాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ రెహమాన్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నల్లజర్ల తరలిన తెలుగు తమ్ముళ్లు



కోరుకొండ, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో నల్లజర్ల శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి పలువురు తెలుగు తమ్ముళ్లు వెళ్లారు. వీరిలో మండల కన్వీనర్ మింగి లక్ష్మీనారాయణ తదితదితరులున్నారు.

శ్రీరాంపురంలో కుట్టులో శిక్షణ



దివాన్‌చెరువు, ఏప్రిల్ 5: కుట్టులో ఉపాధి అవకాశాలు అధికమని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. శ్రీరాంపురంలో కుట్టుశిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ శిక్షణకు దాదాపు 60 మంది మహిళలు హాజరయ్యారు. కార్యక్రమంలో ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు, వీరాస్వామి, కాళ్ల రామారావు, కె.వెంకట్రావు, బి.సూరిబాబు, శ్రీను, బోయిడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కడియంలో ‘బాధ్యత’ ఇఫ్తార్ విందు

కడియం, ఏప్రిల్ 5: బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు ఆధ్వర్యంలో శుక్రవారం కడియం మసీదులో ముస్లిం లకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. 20 ఏళ్లుగా ఏటా రంజాన్ మా సంలో ఇఫ్తార్ విందు ఇస్తున్నట్టు బాబు చెప్పారు. మంత్రి చెల్లబోయిన వేణు, మాజీ ఎంపీ గిరజాల స్వామినాయుడు విచ్చేసిన ఈ కార్యక్రమంలో రామదాసు పేపరుమిల్లు ఎండీ శివశంకరరెడ్డి, వైసీపీ నాయకులు నక్కా రాజబాబు, టేకి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామ్, షేక్ సలీం, ఎండీ సర్కార్‌భాషా, షేక్ గౌస్, షేక్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓటు బ్యాంకు చెక్కు చెదరలేదు

రాజానగరం ఎమ్మెల్యే అభ్యర్థి పెదబాబు

సీతానగరం, ఏప్రిల్ 5: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ నియోజకవర్గ అభ్యర్థిగా ముండ్రు వెంకట శ్రీనివాస్ (పెదబాబు) మండలంలోని ఇనుగంటివారిపేటలో మసీదు నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. శుక్రవారం ఆయన స్థానిక మసీదుకు చేరుకుని ముస్లిం పెద్దలతో ముచ్చటించారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని, గ్రామంలో ముస్లింలు సంపూర్ణ మద్దతు ప్రకటించారన్నారు. కార్యక్రమంలో అయిల శ్రీనివాస్, గుండుబోగుల శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో పార్శిల్ సర్వీసు కార్యాలయాల తనిఖీ

కొవ్వూరు, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, గిఫ్టులు రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం కొవ్వూరులోని పార్శిల్ సర్వీసు కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను రాజకీయపార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 6 ఏప్రిల్ 2024 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా. 6.26
సహారి(ఆది) ఉ. 4.30

ఎండా కాలమ్

	గరిష్టం	కనిష్టం
రాజమండ్రి	44.0	24.0



భగ భగ

మండిన రాజమహేంద్రి

- శుక్రవారం 44 డిగ్రీల ఉష్ణోగ్రత
- మలమలమాడిపోయిన జనం
- నిర్మానుష్యంగా మారిన వీధులు
- ఏప్రిల్ నెలలోనే భానుడి ఉగ్రరూపం
- భయపడుతున్న ప్రజానీకం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5 : ప్రచండ భానుడు ఉగ్రరూపం దాల్చాడు. జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తారాస్థాయికి చేరాయి. గత వారం రోజులుగా భానుడు 40 డిగ్రీలకు చేరువయ్యాడు. మే మొదటి వారంలో కాసే ఎండలు ఏప్రిల్ మొదటి వారంలో కాస్తున్నాయి. నెల రోజుల ముందే భానుడు ప్రతాపానికి ప్రజలు భయపడుతున్నారు. మార్చి నెలాఖరున 36 నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అయితే ఈ నెల ఆరంభం నుంచి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూవచ్చాయి. గత నాలుగు రోజులుగా 40-41 మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే ఈ నెల 5 నుంచి తీవ్రస్థాయిలో ఎండలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన ప్రకారమే శుక్రవారం జిల్లాలో తీవ్రస్థాయిలో ఏండ కాసింది. శుక్రవారం రాజమహేంద్రవరం ఉష్ణోగ్రత గరిష్టం 44.0 కనిష్టం 24.0గా నమోదైంది. ఎండదెబ్బకు రాజమహేంద్రవరంతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ముఖ్య పట్టణాలు గ్రామాల్లో ఎండ తీవ్రగానే కాసింది. దీంతో ప్రజలు మలమలమాడిపోయారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రు మనిపించాడు. మధ్యాహ్నం సమయానికి మరింత ప్రతాపం చూపాడు. ఎండ తీవ్రత అమాంతం పెరగడంతో వడగాడ్పులు వీచాయి. సీసీ రోడ్లు, ఇరుకు సందుల మధ్య ఉన్న భవనాల్లో అత్యధిక ఉష్ణం ఉత్పన్నమైంది. ఏసీలు, కూలర్లు ఉన్నవారు వాటిని ఆన్‌చేసుకుని సేదతీరగా పేదలు మాత్రం వారి ఇళ్ళ ముంగిట బెడ్ షీట్లు, గోనే సంచులు తడిపి సేద తీరారు. చంటి పిల్లలు, వృద్ధులు ఇబ్బంది పడ్డారు. ఒకేసారి 4 డిగ్రీల ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలువిలవిల లాడారు. రహదారులన్నీ నిర్మానుషంగా దర్శనమిచ్చాయి. తప్పక పనులకు వెళ్లాల్సిన వారు మాత్రం గొడుగులు, కూలింగ్ కళ్ళజోళ్ళు, కాటన్ ఫేస్ మాస్కులు, టోపీలు ధరించి వెళ్ళారు. సాయంత్రంవేళ శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ తీసుకుని ఎండ తీవ్రతనుంచి ఉపశమనం పొందారు.



మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

నల్లజర్ల సమావేశంలో నాయకులు

స్పీడ్ పెంచాలి!

కూటమి అభ్యర్థులకు చంద్రబాబు దిశా నిర్దేశం

- అంతా విజయం సాధించాలి
- రాజమహేంద్రవరం సిటీ, రూరల్ భేష్
- అన్ని నియోజకవర్గాల్లో దూకుడు పెంచాలి
- రెండు రోజుల్లో అనపర్తి సీటుపై క్లారిటీ
- కొవ్వూరులో జవహర్‌ను కలుపుకోవాలి
- నిడదవోలులో జోరు పెంచండి
- గోపాలపురాన కలుపుకుని వెళ్లాలి
- రాజానగరం ఇంకా పికప్ కావాలి
- తరువాత నేను..పవన్ ఉమ్మడి పర్యటన

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుంది. మన ప్రభుత్వం ఏర్పడుతుంది. జిల్లాలో అభ్యర్థులు, నేతలు బాగా పనిచేస్తున్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నల్లజర్లలోని ప్రియాంక కన్వెన్షన్‌లో శుక్రవారం రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలోని పార్టీ నేతలు, అభ్యర్థులతో ఎన్నికల నేపథ్యంలో సమీక్షించారు. జిల్లాలో రాజమహేంద్రవరం సిటీ, రూరల్ నియోజకవర్గాలు బాగా పుంజుకున్నాయి. మంచి జోష్‌లో ఉన్నాయి. మిగతా చోట్ల ఇంకా వేగవంతం చేయాలి.. అందరినీ కలుపుకుని పోవాలని సూచించారు. రాజమహేంద్రవరం సిటీ నుంచి కూటమి అభ్యర్థి, టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ హాజరయ్యారు. మీ కోఆర్డినేషన్ బాగుందని ఆయన చెప్పడం గమనార్హం. రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి శుక్రవారం రాయుడుపాకల గ్రామం నుంచి ముహూర్తం ప్రకారం ప్రచారం ప్రారంభించడం వల్ల సమావేశానికి హాజరు కాలేదు. కానీ తర్వాత గోరంట్ల, తన కుమార్తె కంఠంనేని శిరీషతో కలిసి వచ్చి చంద్రబాబును కలిశారు. అనపర్తి నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. టీడీపీ తొలిజాబితాలోనే అభ్యర్థిగా ఉన్న ఆయనకు తర్వాత సమస్య వచ్చి పడిన సంగతి తెలిసిందే. కానీ చంద్రబాబు ఆయనతో నవ్వుతూ మాట్లాడుతూ రెండు రోజుల్లో మీ సమస్య పరిష్కారమవుతుందని చెప్పడం గమనార్హం. ఇక్కడ బీజేపీ సీటు వదులుకోవడానికి బదులుగా వేరే జిల్లాలో మరో సీటు తీసుకోవడానికి అంగీకరించినట్టు సమాచారం.దీంతో రామకృష్ణారెడ్డి తిరిగి టీడీపీ అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉంది. రాజానగరం జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను ఉద్దేశించి మీరింకా అందరినీ కలుపుకుంటూ.. స్పీడ్ పెంచాలని చెప్పారు.దీంతో ఆయన మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర ముందుకు వస్తే చాలా మేలు జరుగుతుందని చెప్పినట్టు సమాచారం. తాను మాట్లాడతానని చంద్రబాబు చెప్పడం గమనార్హం. ఇక కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కింగ్‌మేకర్ పెండ్యాల అచ్చిబాబు, ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమనేని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పాల్గొన్నారు. పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడిగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా మాజీ మంత్రి కెఎస్ జవహర్ పాల్గొన్నారు. ఇక్కడ చంద్రబాబు మాట్లాడుతూ జవహర్ తన సీటును త్యాగం చేశారు. కొవ్వూరులో ఆయనను కలుపుకోవాలి. ప్రతి దాంట్లోనూ ఆయన ఫొటో కూడా ఉండాలని సూచించడం గమనార్హం. జవహర్ రాజమహేంద్రవరం కేంద్రంగా అన్ని నియోజకవర్గాల్లో పాల్గొంటారని కూడా చెప్పారు. నిడదవోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థి కందుల దుర్గేష్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు హాజరయ్యారు. ఇక్కడ ఇంకా అందరినీ కలుపు కుని వెళ్లాలని.. మరింత వేగం పుంజుకోవాలని సూచించడం గమనార్హం.



నల్లజర్లలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరుతున్న మహిళా నాయకులు

అమలాపురం, ముమ్మిడివరం జనసేన ఇన్‌చార్జిలు పార్టీ మారడంపై దుర్గేష్ ప్రస్తావించగా త్వరలో అక్కడ పార్టీ ఇన్‌చార్జిలను పెట్టడం అవసరం అని చంద్రబాబు చెప్పారు. అంతేకాకుండా త్వరలో తాను, పవన్ కలిసి అమలాపురం, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఉమ్మడిగా రోడ్ షోలు నిర్వహిస్తామని చెప్పా రు. గోపాలపురం నుంచి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు హాజరుకాగా ఇక్కడ బాగానే ఉంది..కానీ ఇంకా అందరినీ కలుపుకుని ముందుకు వెళ్లాలని చెప్పడం గమనార్హం. అసంతృప్తిగా ఉన్న బాపిరాజుతో తాను మాట్లాడతానని చెప్పడం గమనార్హం. తర్వాత ముళ్లపూడి బాపిరాజుతో కూడా చంద్రబాబు మాట్లాడారు. ఇది పార్టీ నిర్ణయం అందరూ కలసి పనిచేసి ముందుకు వెళ్లాలని బాపిరాజుకు సూచించగా, తాను ఇక్కడ పనిచేయనని, వేరే నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తానని చెప్పడం గమనా ర్హం. అలా కుదరదు పార్టీకోసం పనిచేయాలని చంద్ర బాబు సూచించారు. చంద్రబాబు వెళ్లిపోయిన తర్వాత బాపిరాజు తన అనుచరులతో మాట్లాడుతూ నేను పార్టీ లోనే ఉంటాను. కానీ ఇక్కడ ప్రచారం చేయను. మిమ్మల్ని ఎవరినీ చేయవద్దని చెప్పను. మీ ఇష్టం అని చెప్పడం గమనార్హం.అందరూ అందరికీ కలుపుకుని ముందుకు వెళ్లాలని అందరికీ ఆయన సూచనలు చేశారు. ఇదిలా ఉండగా నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. బయటకు వచ్చిన తరువాత మాట్లాడుతూ పోటీచేయడం ఖాయం.. ఎక్కడి నుంచి అనేది సాయంత్రానికి తేలుతుందన్నారు. అనంతరం చంద్రబాబు సమక్షంలో పాలకొల్లులో ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు.టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జిల్లాలో పర్యటన విజయవంతం కావడంతో టీడీపీ జనసేన,బిజెపి కూటమిలో జోష్ పెరిగింది. కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో జరిగిన ప్రజాగళం సభలు బాగా సక్సెస్ కావడం, అన్నివర్గాల ప్రజలు భారీగా హాజరు కావడంతో ఆనందం పెరిగింది. గురువారం రాత్రి నల్లజర్లలోనే బస చేసిన చంద్రబాబు శుక్రవారం జిల్లా నేతలు, అభ్యర్థులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. అసంతృప్తులను బుజ్జగించడంతో పాటు ఆయా అభ్యర్థులకు కూడా అందరినీ కలుపుకుని వెళ్లాలని సూచించారు. చంద్రబాబు పర్యటనతో వీరందరిలో కూడా ఉత్సాహం పెరిగింది. ఇక ప్రచారం హోరు పెరగనుంది. బీజేపీ అభ్యర్థి పురందేశ్వరి ఎన్నికల కార్యాలయం శనివారం ప్రారంభంకానుంది.

టీడీపీదే అనపర్తి సీటు?

అనపర్తి, ఏప్రిల్ 5 : అనపర్తి సీటుపై నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చినట్టు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు.అనపర్తిలో టీడీపీ పోటీ చేస్తుందని ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చినట్టు చెప్పారు. త్వరలోనే ప్రకటన వెలువడుతుందని ప్రకటించారన్నారు.శుక్రవారం నల్లజర్లలో జరిగిన టీడీపీ పార్లమెంటరీ రివ్యూ అనంతరం తాను చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయినట్టు తెలిపారు. ఎన్డీఏ గెలుపే లక్ష్యంగా కొన్ని సీట్లు మార్పు అనివార్యంగా మారిందని..అనపర్తి సీటు కూడా మార్పు చేస్తున్నట్టు తెలిపారన్నారు.దీంతో అనపర్తి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది.



పాలమూరులో సైకిల్‌పై న్యాయం కోసం నల్లమిల్లి యాత్ర చేస్తున్న రామకృష్ణారెడ్డి



నల్లజర్లలో శుక్రవారం చంద్రబాబును కలిసి బయటకు వస్తున్న నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు

ఏం తమాషాలు చేస్తున్నారా.. సస్పెండ్ చేస్తా..!

మద్దిపాటి మాకొద్దంటూ బాబు కాన్వాయ్ అడ్డుకున్న నాయకులపై ఆగ్రహం



పార్టీలోనే ఉంటా : బాపిరాజు

తాను టీడీపీలోనే కొనసాగుతానని గోపాలపురం నియోజక వర్గ అభ్యర్థి మద్దిపాటికి తాము సహకరించలేనని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు అన్నారు.చంద్రబాబు వెళ్లిన తరువాత ప్రియాంక కన్వెన్షన్‌లో తన అనుచరులతో సమావేశం ఏర్పాటు చేశారు. తాను సహకరించేది లేదని ఎవరికైనా ఇష్టం ఉంటే సహకరించవచ్చని తెలిపారు.తాను మరో పార్టీకి వెళ్లే అవసరం లేదన్నారు.



నల్లజర్ల,ఏప్రిల్ 5 : మద్దిపాటి మాకొద్దు ఎవరైనా ముద్దు అనే ఫ్లకార్డులతో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు వర్గీయులు చంద్రబాబు కారును అడ్డుకు న్నారు. దీంతో చంద్రబాబు నాయుడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం తమాషాలు చేస్తున్నారా.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తా.. జాగ్రత్తగా ఉండండి అనే హెచ్చరించారు.చంద్రబాబు హెచ్చరించినా అడ్డుకోవడంతో రోప్‌పార్టీ సిబ్బంది,పోలీసులు బలవంతంగా నెట్టివేసి చంద్రబాబు కారును పంపించివేశారు. గోపాలపురం నియోజక వర్గం నాయకులు, బాపిరాజు వర్గీయులు 400 మంది ప్లకార్డులు పట్టుకుని మద్దిపాటి మాకొద్దు అంటూ నినాదాలు చేశారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి,గన్ని వీరాంజనేయులు,బాపిరాజులను చంద్రబాబు పిలిపించి మాట్లాడారు.తాడేపల్లిగూడెం,కొవ్వూరు,గోపాలపురం నియోజక వర్గ అభ్యర్థులను గెలిపించాలని బాపిరాజుకు సూచించారు. తాను కొవ్వూరు,తాడేపల్లిగూ డెం నియోజకవర్గ అభ్యర్థులకు సహకరిస్తానని,గోపాలపురంలో తాను సహకరించలేనని బాపిరాజు చంద్రబాబుకు చెప్పినట్టు సమాచారం.



గోపాలపురం,పోలవరం అభ్యర్థులను మార్చాలని నల్లజర్లలో టీడీపీ నాయకుల నిరసన



కొవ్వూరులో పురందేశ్వరికి మొక్కను అందజేస్తున్న జవహర్

పురందేశ్వరికి ఘన స్వాగతం

రాజమహేంద్రవరం సిటీ/అర్బన్, ఏప్రిల్ 5 : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎన్టీఆర్ కుమార్తె దగ్గుబాటి పురందేశ్వరి శుక్రవారం రాజమహేంద్రవరం వచ్చారు.తొలుత జిల్లాలోకి అడుగుపెడుతూనే ద్వారకాతిరుమల చినవెంకటేశ్వరస్వామిని, వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌కు చేరుకున్నారు.ఈ సందర్భంగా పురందేశ్వరికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కొత్తపల్లి ఆశిష్ లాల్, వసలపూడి సుభాష్ చంద్రబోస్, బూరుగుపల్లి వీరరాఘవులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. తొలుత వట్టికూటి ప్రసాద్ బాబు ఫ్రెండ్స్ బృందం పురందేశ్వరి వెంకటేశ్వరరావు దంపతులను ద్వారకాతిరులమలతో కలిసి స్వాగతం పలికారు. రాజమహేంద్రవరంలో శనివారం బీజేపీ, తెలుగుదేశం, జనసేన నాయకులతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం జేఎన్ రోడ్డులో ఎన్నికల కార్యాలయం ప్రారంభించనున్నారు. అనంతరం చెరుకూరి వీర్రాజు కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఎన్డీఏ కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొంటారు.ఈ కార్యక్రమంలో యువనాయకులు వట్టికూటి ప్రసాద్ బాబు, పాలచెర్ల కృష్ణ, మురళీ, బాబీ పాల్గొన్నారు.



పేపరుమిల్లు ఎదుట కార్మికులు, వామపక్ష సంఘాల నాయకుల ధర్నా

పేపరుమిల్లు కార్మికుల నిరసన

వేతన ఒప్పందం అమలుచేయాలని నిరాహారదీక్ష

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: ఏడాదికి రూ.200 కోట్లు నికర లాభాల్లో ఉన్న ఏపీ పేపరుమిల్లు యాజమాన్యం అందులో పనిచేసే 2500 మంది కార్మికుల వేతన ఒప్పందాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పేపరుమిల్లులో 11 యూనియన్లు ఉన్నాయన్నారు. 2017 నుంచి కార్మికులకు వేతన ఒప్పందం చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందన్నారు. కార్మికులు యాజమాన్యానికి ఫిబ్రవరి 24న సమ్మె నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఈ నెల 2 నుంచి సమ్మెలోకి దిగారని చెప్పారు. మిల్లు లోపలే కార్మికులు సమ్మెలో కూర్చున్నారని చెప్పారు. దీనిపై కనీసం అధికార ప్రతిపక్షపార్టీలు స్పందించకపోవడం దారుణమన్నారు. రాజకీయ పార్టీలకు 2500 మంది మిల్లు కార్మికుల ఓట్లు అవసరంలేదా అని ప్రశ్నించారు. కార్మికులకు న్యాయం చేయకపోతే 10 వేల మంది కార్మికులతో రాజమహేంద్రవరంలో నిరసన ర్యాలీ, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఐఎన్‌టీయూసీ నాయకులు ముళ్ళ మాధవ్, ఐఎఫ్‌టీయూ నాయకులు కే.జోజి , సీఐటీయూ నాయకులు ఎస్ఎస్.మూర్తి ,బి.రాజులోవ పాల్గొన్నారు.

చిన్నారుల ప్రాణాలతో.. ఆటలా!



రోజంతా పలు ప్రైవేటు పాఠశాలలు

- ఒంటిపూట బడుల ఊసేలేదు
- విద్యార్థుల తీవ్ర ఇబ్బందులు
- ఠారెత్తిస్తున్న ఎండలు.. అయినా పట్టని విద్యాశాఖ
- అధికారుల తనిఖీలు లేక యాజమాన్యాల ఇష్టారాజ్యం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. 41 డిగ్రీలు దాటి భగభగమంటున్నాయి. పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచనలు చేస్తున్నారు. కానీ ఇవేమీ విద్యాశాఖకు పట్టనట్లు కనిపిస్తోంది. ఒంటిపూట బడులు నిర్వహించాలంటూ ఉత్తర్వులు జారీ చేయడంతో సరిపెట్టేసింది. అమలును మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. దీంతో ప్రైవేటు పాఠశాలలు ఇష్టారాజ్యంగా రోజంతా తరగతులను నిర్వహిస్తున్నాయి. పది మూల్యాంకనం(స్పాట్) ఉండడంతో అధికారులు దానిపై దృష్టి సారించారు. దీంతో పర్యవేక్షణ కొరవడి ప్రైవేటు పాఠశాలల తీరు సందట్లో సడేమియాగా ఉంది.ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండడంతో పాఠశాలల్లోని ఫ్యాన్ల నుంచి, కిటికీల్లోంచి వచ్చే గాలి కూడా వేడిగానే ఉంటోంది. పిల్లలు కూర్చునే బెంచీలు వేడెక్కిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో పిల్లలు నీరసించి కనీసం అన్నం కూడా తినలేని నిస్సత్తువతో ఇబ్బంది పడుతున్నారు.

ప్రైవేటు నిర్లక్ష్యం..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 986, ప్రైవేటు /కార్పొరేటు పాఠశాలలు 587 ఉన్నాయి. గత నెల 18 నుంచి ఏప్రిల్ 23 వరకూ ఒంటిపూట బడుల షెడ్యూల్ విడుదల చేశారు. పది పరీక్షలు గత 18వ తేదీ నుంచి మొదలు కావడంతో పరీక్షా కేంద్రాలు ఉన్న స్కూల్స్ ఒంటిపూట బడుల సమయాలను పరీక్షలు ముగిసే వరకూ మార్పు చేశారు. పరీక్షా కేంద్రం లేని స్కూల్స్‌లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ, పరీక్షా కేంద్రం ఉన్న చోట మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకూ తరగతులు నిర్వహించేలా ఉత్తర్వులిచ్చారు. పది పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచి అన్ని స్కూల్స్‌లో ఉదయం 7.45 గంటల నుంచి మధ్యా హ్నం 12.30 గంటల వరకూ మాత్రమే తరగతులు నడవాల్సి ఉంది. ఈ సమయాలను అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు పాటించాలి. కానీ కొన్ని ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలు ఉత్తర్వులు తమకు వర్తించవన్నట్టు ప్రవర్తిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనమైన తర్వాత పిల్లలను ఇంటికి పంపేస్తున్నారు. కానీ అధికశాతం ప్రైవేటు పాఠశాలల్లో సాయంత్రం వరకూ విద్యార్థులను ఇళ్ళకు పంపించడం లేదు.అధికారులు కూడా చూసీచూడకుండా వదిలేయడంతో రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రెండు వారాల నుంచి పలు కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలల్లో రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులకు మాత్రం తెలియక పోవడం చిత్రమని తల్లిదండ్రులు అంటున్నారు.రెండు పూటలా బడులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ రెండు రోజుల కిందట జిల్లా పాఠశాల విద్యాధికారి వాసుదేవరావు ఉత్తర్వులిచ్చారు.కానీ ఫలితం మాత్రం కానరాలేదు. విద్యార్థులకు ఎండదెబ్బ తగిలితే ఎవరు బాధ్యత వహిస్తారో చెప్పాలంటూ తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చే సరికి నీరసించిపోతున్నారని ఆవేదన చెందుతున్నారు.

95.44 శాతం పింఛన్లు పంపిణీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పింఛన్ల పంపిణీ 3 రోజుల్లో 95.44 శాతం పూర్తయింది.ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయం విడుదల చేసిన వివరాల ప్రకారం.. జిల్లాలో 2,43,831 మంది లబ్ధిదారులు ఉండగా శుక్రవారం సాయంత్రానికి 2,29,813 మందికి పింఛను అందజేశారు. మొత్తానికి 95.44 శాతం పూర్తయింది. నల్లజర్ల మండలంలో అత్యధికంగా 96.41 శాతం పంపిణీ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం సాయంత్రం నల్లజర్లలో 'ప్రజాగళం' నిర్వహించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో ఆ మండలంలో అధికశాతం పంపిణీ జరగడం గమనార్హం. ఇంటింటికీ కూడా పింఛన్లు పంపిణీ చేస్తున్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి



రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 5: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను భావిత రాలకు అందించడమే నిజమైన నివాళి అని కలెక్టర్ డా.కె.మాధవీ లత అన్నారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం జగ్జీవన్ రామ్ 116వ జయంతిని పురస్కరించు కుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో ప్రతి ఒక్కరు సమానత్వంతో ఉండాలనే లక్ష్యంతో బడుగు బలహీన వర్గాల విద్య విషయంలో అత్యంత ప్రాధా న్యతను ఇచ్చారన్నారు. బాబు జగ్జీవన్‌రామ్‌ని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ తమ కుటుంబంలోని పిల్లలను బాగా చదివించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎస్పీ జగదీశ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ మార్గాన్ని,ఆదర్శాలను, సంస్కరణలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో డీఆర్‌వో జి.నరసింహులు, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.సం దీప్,అడిషనల్ ఎస్పీలు పి.అనీల్‌కుమార్, రాజశేఖర్ రాజు, టి.సర్కార్, ఎల్.చెంచిరెడ్డి,డీఎస్పీ డి.ప్రభాకర్, ఇన్‌స్పెక్టర్ సూరి అప్పారావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలి

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



కొవ్వూరు 8వ వార్డులో భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ముప్పిడి

కొవ్వూరు, ఏప్రిల్ 5: వైసీపీ దుర్మార్గ పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొవ్వూరులోని 8వ వార్డులో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఎన్నికల ముందు జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నమ్మించి మోసం చేశారన్నారు. కార్యక్రమంలో దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, సూర్యదేవర రంజిత్, రాజాన శ్రీనివాస్, కె.నవ్య పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథం ప్రారంభం

కొవ్వూరు, ఏప్రిల్ 5: కొవ్వూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియోజకవర్గ ప్రచార రథాన్ని ప్రారంభించారు. శుక్రవారం ద్వారకాతిరుమలలో వేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకుని తిరుగు ప్రయాణంలో కొవ్వూరు, పంగిడిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గండ్రోతు పవన్ తయారు చేయించిన ప్రచార రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, బీవీ ముత్యాలరావు, ఎం.రామచంద్రరావు, పిక్కి నాగేంద్ర, మండలాధ్యక్షుడు పెరుగు పోతురాజు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న చిన్నజీయర్ స్వామి

కొవ్వూరు, ఏప్రిల్ 5: కొవ్వూరులోని బసివిరెడ్డి పేటలో రాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విగ్రహప్రతిష్ఠ శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాల్లో భాగంగా త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి, త్రిదండి అహోబల రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి ప్రతిష్ఠోత్సవం నిర్వహించారు. రాత్రి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహించారు. శనివారం అన్నదానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దేవగుప్తాప లక్ష్మణరావు, ఆలయార్చకులు గొడవర్తి సత్యనారాయణాచార్యులు, వేణుగోపాలచార్యులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

17 మద్యం సీసాలు స్వాధీనం

నిడదవోలు, ఏప్రిల్ 5: నిడదవోలు మండలం గోపవరం గ్రామానికి చెందిన ఆరేపల్లి కోట సత్యవేణి నుంచి 17 క్వాటర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సమిశ్రగూడెం ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కాకరపర్రులో సత్తెమ్మతల్లి స్థిర ప్రతిష్ఠ



పెరవలి, ఏప్రిల్ 5: కాకరపర్రులో శ్రీ సత్తెమ్మతల్లి స్థిర ప్రతిష్ఠ, నూతన ఆలయ ప్రారంభోత్సవంలో నియోజకవర్గ కూటమి అభ్యర్థి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ కాకరపర్రు పూల తోటలకు ప్రసిద్ధి అని, ఇక్కడి యువకులు స్వయం శక్తితో ఉపాధి పొందడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వూరులో బైక్ చోరీ

కొవ్వూరు, ఏప్రిల్ 5: బైక్ దొంగతనంపై కేసునమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎం.సునోద్‌కుమార్ తెలిపారు. కొవ్వూరు రైల్వేస్టేషన్ వద్ద నివాసం ఉంటున్న వర్ని వెంకట నాగేంద్ర ఫిబ్రవరి 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి వద్ద పెట్టిన హీరో గ్లామర్ బైక్ దుండగులు దొంగలించుకుపోయారు. వెతికిన కనిపించకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కొవ్వూరులో పార్శిల్ సర్వీసు కార్యాలయాల తనిఖీ



కొవ్వూరు, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నగదు, గిఫ్టులు రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం కొవ్వూరులోని పార్శిల్ సర్వీసు కార్యాలయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలను రాజకీయపార్టీలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ సీహెచ్ బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలమూరులో 'న్యాయం కోసం నల్లమిల్లి'



పొలమూరులో కుటుంబంతో కలిసి పర్యటిస్తున్న నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 5: టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులో భాగంగా అనపర్తి అసెంబ్లీ సీటును కోల్పోయిన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేపట్టిన న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని పొలమూరులో నిర్వహించారు. తల్లి సత్యవతి, భార్య మహాలక్ష్మి, కుమారుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె సానతనితో కలిసి పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం చిన పొలమూరు చేరుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పది రోజులుగా తాను చేస్తున్న పోరాటానికి చంద్రబాబు నుంచి భరోసా లభించిందని, అన పర్తి నుంచి టీడీపీ పోటీలో ఉండటం ఖాయమన్నారు. త్వరలోనే ప్రకటన వెలువడుతుందని, శుక్రవారం నల్లజర్లలో జరిగిన టీడీపీ పార్లమెంటరీ రివ్యూ అనంతరం తాను చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయినట్లు నల్ల మిల్లి తెలిపారు. ఎన్డీయే గెలుపే లక్ష్యంగా కొన్ని సీట్లు మార్పు అనివార్యమైం దని, అనపర్తి సీటును కూడా మార్పు చేస్తున్నట్టు ఆయన తెలిపారన్నారు. ఐదేళ్లుగా వైసీపీ దాష్టికానికి అనేక మంది బలైపోయారని, ఆ పార్టీని అంతమొందించాలన్న లక్ష్యంతో ఏర్పడిన కూటమి విజయం సాధిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆళ్ల గోవిందు, తమలంపూడి సుధాకర రెడ్డి, వెలుగుబంటి సత్తిబాబు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, జుత్తుగ కృష్ణ, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

దేవరపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని యర్నగూడెంలో శుక్రవారం పార్ట్ ఇండి యా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంస్థ సేవలు అభినందనీయమని స్థానిక జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఛత్రపతి శివాజీ అన్నారు. కార్యక్రమంలో పార్ట్ ఇండియా అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, సభ్యులు రాజారావు, వెంకట్రావు, జాలింకి హేమంత్, బాబురావు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు గంజి పవన్ పాల్గొన్నారు.



నన్నయ వర్శిటీలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ



కొవ్వూరులో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముప్పిడి



నిడదవోలు: లింగంపల్లిలో జగజ్జీవనరామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దుర్గేష్

మహనీయుడు జగ్జీవన్‌రామ్

- ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి
- జయంతి కార్యక్రమంలో 'నన్నయ' వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 5: విద్యతోనే ఏసమస్యనైనా అధిగమించగలమని దృఢసంకల్పంతో దేశ చరిత్రలో తనదైన ముద్ర వేసుకున్న మహనీయుడు బాబూజగ్జీవన్‌రామ్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. నన్నయ వర్శిటీలో జరిగిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాబూ జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, విద్యలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. బాబూజీ జీవితచరిత్రను వివరించారు. తల్లిదండ్రులు, అధ్యాపకులు మహనీయుల జీవిత చరిత్రలను విద్యార్థులకు బోధిస్తుండాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య వి.సు రేష్‌వర్మ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో కొవ్వూరు మెరకవీధిలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, 30 ఏళ్లపాటు కేంద్రమంత్రిగా, దేశ ఉపప్రధానిగా ఎన్నో పదవులు నిర్వహించి, పలు వ్యవస్థల్లో అనేక సంస్కరణలు తీసుకువచ్చిన గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పాలూరి నీలిమ, జనసేన పట్టణాధ్యక్షుడు డేగల రాము పాల్గొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ.. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలు పంచారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కొడూరి శివరామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. టీడీపీ పార్లమెంటు కార్యాలయంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పసలపూడి బోసు, కొప్పాక నరసయ్య, ముత్యాల రాంబాబు, మెరిపో వెంకటరత్నం పాల్గొన్నారు. పంగిడిలోని దళితవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమెను జనసేన నాయకుడు కొప్పాక విజయకుమార్ సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల చాంబర్ నియోజకవర్గ అధ్యక్షుడు ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, బీజేపీ, జనసేన మండలాధ్యక్షులు పెరుగు పోతురాజు, సుంకర సత్తిబాబు, నాయకులు ఉప్పులూరి చిరంజీవి, పొట్రు సిద్ధూ, కోమటి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలు మండలంలోని లింగంపల్లి, సమిశ్రగూడెం గ్రామాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ నివాళులర్పించారు. జగజ్జీవనరామ్ ఉప ప్రధానిగా, కేంద్రమంత్రిగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కొమ్మిన వేంకటేశ్వరరావు, జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, బండి గోపాలకృష్ణ, కట్టా మణికంఠ, పడాల బ్రహ్మజీ, బీమడోలు కిరణ్‌కుమార్, బుగ్గే శివరామకృష్ణశాస్త్రీ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని కానూరు, పెరవలి, ముక్కామ తదితర గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేశారు. పిట్లవేమవరంలో జరిగిన కార్యక్రమంలో మండా చిన వెంకటరెడ్డి, మండా తాతారెడ్డి, కర్రి శ్రీనివాసుల రెడ్డి, పడాల చినబాబు, గోపి, వర్మ పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. తహశీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అణగారిన వర్గాలకు వెన్నుదన్నుగా ఉండి 40 ఏళ్లు ఎంపీగా ప్రజలకు సేవచేసి దేశ ఉప ప్రధానిగా ఎదిగిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఆర్ఐ కిషోర్, వీఆర్వోలు నాగేశ్వరరావు, నరేష్, సుజాత, విజయ, సంజీవ్ పాల్గొన్నారు. మలకపల్లిలో యంగ్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గెడ్డం రాములు, మద్దిపాటి రామారావు, మద్దిపాటి ప్రకాశరావు, కాసాని చిట్టిబాబు పాల్గొన్నారు. మల్లిపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మలకపల్లిలో పలు కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లిపూడి ధనరాజు, కుంటముక్కల కేశవ నారాయణ, మరపట్ల చంటి రాజు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ దేశంలో పార్లమెంట్ సభ్యుడిగా, పలు శాఖలకు మంత్రిగా పనిచేసి ఆ శాఖలకే వన్నె తెచ్చారని, ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, కడిమి రాజు, దుగ్గిన గంగాధర్, పచ్చా రామ్‌గోపాల్, మాధవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. దుద్దుకూరులో జరిగిన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో సర్పంచ్ బొంతా నాగమని, సొసైటీ అధ్యక్షుడు రామకృష్ణ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం/గోపాలపురం: పలు గ్రామాల్లో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడారు. దేశానికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు ఎనలేనివని, కేంద్రమంత్రి పదవులు అనేకం చేసి దేశాభివృద్ధికి కృషి చేశారన్నారు. దళితులకు బీఆర్ అంబేద్కర్, బాబూజగ్జీవన్‌రామలు రెండు కళ్లు వంటివారని కొనియాడారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, కాల్ధరిలో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు, వైస్ ఎంపీపీ చెట్టే నవీన్.. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మార్పీఎస్ నాయకులు చెట్టే సుజనరావు, దిద్దే మధుబాబు తదితరులు నివాళులర్పించారు.



పెరవలి: పిట్లవేమవరంలో జగజ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం



తాళ్లపూడి: మలకపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ దుర్గారావు

కూటమి విజయం బీసీల గెలుపే

బీసీ నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి



బీసీ నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని గెలిపిస్తే అది రాష్ట్రంలోని బీసీలు విజయం సాధించినట్లేనని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. స్థానిక 3,4 డివిజన్ల బీసీ నాయకుల సమావేశం శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అధ్యక్షతన శుక్రవారం రాత్రి జరిగింది. దీనికి ఆదిరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌తో రాష్ట్రంలో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. 50 ఏళ్లకే పింఛన్లు, బీసీల సంక్షేమానికి రూ1.50 లక్షల కోట్లు కేటాయింపులు, కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య, ఫీజురీయంబర్స్‌మెంట్, బీసీల రక్షణ చట్టం వంటి పథకాలు అమలు కావాలంటే కూటమి అధికారంలోకి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డిమణి, తాడేపల్లిగూడెం పరిశీలకుడు నక్కా చిట్టిబాబు, నక్కా దేవివరప్రసాద్, బుడ్డిగ రాధా, బుడ్డిగ రవి, యాళ్ల శ్రీనివాసరావు, అహ్మద్ మునిషా, కొండపల్లి శ్రీదేవి, కుడుపూడి సరోజిని, సాగి నాగమణి పాల్గొన్నారు.

నేడు టీడీపీ లీగల్ రాష్ట్ర వర్క్‌షాప్

టీడీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జి గన్ని కృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జోన్-2 పరిధిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ వర్క్‌షాప్‌ను రాజమహేంద్రవరం గన్నిస్ శుభమస్తులో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నామని టీడీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ శుక్రవారం తెలిపారు.ఈ వర్క్‌షాప్‌నకు లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు, గౌరవ అతిథులుగా మాజీ అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పి.కృష్ణమోహన్, జోన్ -2 ఇన్‌చార్జులు సుజయ కృష్ణ రంగారావు, మందలపు రవి, కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు, న్యాయవాదులు హాజరవుతారని చెప్పారు.

రైల్వే స్టేషన్‌లో క్యూఆర్ కోడ్ సదుపాయం



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని సాధారణ టికెట్ల(అన్ రిజర్వుడు)ను క్యూఆర్ కోడ్ ద్వారా డబ్బులు చెల్లించి తీసుకోవచ్చు. ఈ మేరకు సాధారణ టికెట్ కౌంటర్ల వద్ద క్యూఆర్ కోడ్ సదుపాయాన్ని విజయవాడ రైల్వే డివిజన్‌లోని విజయవాడ, ఏలూరు, తెనాలి, రాజమండ్రి రైల్వే స్టేషన్లలో అందుబాటులోకి తెచ్చారు. టికెట్లు తీసుకునే సమయంలో చిల్లర సమస్యను అధిగమించడంతో పాటు నగదు లావాదేవీలను తగ్గించడంలో భాగంగా డిజిటల్ సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

- గ్రేడ్-ఏ రకం ధాన్యం క్వింటాల్ రూ.2,203, గ్రేడ్-బి రూ.2,183
- వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాసరెడ్డి



నామవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ

రాజానగరం, ఏప్రిల్ 5: మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ శ్రీని వాసరెడ్డి పిలుపునిచ్చారు. రబీ సీజన్‌కు సంబంధించి మండలంలోని నామవ రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారం భించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా, తాము పండించిన ధాన్యాన్ని నేరుగా రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. మండలంలో నామవరంతో పాటు సంపత్‌నగరం, కలవ చర్ల, నందరాడ, సీతారాంపురం, నరేంద్రపురం-1, పాలచర్ల, ముక్కినాడ, కాన వరం, రాజానగరం-1; తోకాడ-1, వెలుగుబంద-1; కొత్తతుంగపాడు, జి.యర్రం పాలెం, కొండగుంటూరు, పాతతుంగపాడు గ్రామాల్లో 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రేడ్-ఏ (ఫైన్ వెరైటీస్, ఆర్ఎన్ఆర్ 15048) రకం ధాన్యం క్వింటాల్ ధర రూ.2,203 కాగా, గ్రేడ్-బి(కామన్ వెరై టీస్, ఎంటీయూ1121) రకం ధాన్యం క్వింటాల్ రూ.2,183 ధర నిర్ణయించినట్టు చెప్పారు. వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిం మాట్లాడుతూ తొలిరోజు సేకరణలో భాగంగా కొత్తతుంగపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో 334 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 60 రోజులపాటు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని రైతులు వినియోగించుకోవాలని ఏవో సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అబ్దుల్ రెహమాన్, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పవన్ రెండో విడత పర్యటన ఖరారు

9న పిఠాపురంలో ఉగాది వేడుకల్లో పాల్గొననున్న జనసేనాని

పిఠాపురం, ఏప్రిల్ 5: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రెండవ విడత పర్యటన ఖరారైంది ఉగాది రోజున ఆయన పిఠాపురంలో ఉండనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నాలుగురోజులు పర్యటించి ఈనెల 2వ తేది రాత్రి విజయవాడ వెళ్లిన పవన్‌కల్యాణ్‌కు తీవ్ర జ్వరం రావడంతో హైదరాబాదుకు వెళ్లిన సంగతి తెలిసిందే. మూడు రోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో ఆయన హైదరాబాదుకే పరిమితయ్యారు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా రెండవ విడత ప్రచార షెడ్యూల్‌ను ఖరారు చేశారు. 7వ తేదిన అనకాపల్లి, 8వ తేదిన యలమంచలిలో పర్యటించి అక్కడ బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. అనంతరం 9వ తేదిన పిఠాపురం నియోజకవర్గంలో జరిగే ఉగాది వేడుకల్లో పవన్ పాల్గొననున్నారు. 9వ తేది అనంతరం షెడ్యూల్‌ను విడుదల చేస్తామని జనసేన వర్గాలు తెలిపారు. రెండవ విడత పర్యటనలో భాగంగా పవన్ పిఠాపురం వచ్చి ఉగాది వేడుకల్లో పాల్గొననుండటంతో అందుకు తగ్గట్టుగా జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

కూటమిదే అధికారం

- తెలుగుదేశం పార్టీ జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ
- కొత్తపల్లిలో 1000 కుటుంబాలు టీడీపీలో చేరిక



గోకవరం: కొత్తపల్లిలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులతో నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 5: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే అధికారమని, సీఎం జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని టీడీపీ జగ్గంపేట అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో వైసీపీకి చెందిన 1000 కుటుంబాలు జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ నెహ్రూ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో నెహ్రూ మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎన్నికల్లో ఎన్ని మాయమాటలు చెప్పినా వినే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరని, జగన్ అరాచక పాలనను పారద్రోలేందుకు రోజులు అతి దగ్గరిలోనే ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అలాగే అచ్యుతాపురంలో పలువురు వైసీపీని వీడి నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంగరాతి రాము, పాలూరి బోస్, ఉంగరాల రాము, దాసరి తమ్మన్నదొర, ఎస్వీఎస్ అప్పలరాజు, సాలెపు నలమహరాజు, బదిరెడ్డి రవి, దాసరి సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 5: వైసీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి అరాచక పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వనాశనం చేశారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కోలమూరు పంచాయతీ పరిధిలోని రాయుడుపాకల నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించారు. ముందుగా కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో వరసిద్ధి వినాయకుడి ఆలయంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం అరుంధతీపేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ప్రచారం మొదలుపెట్టారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ దోపిడీ రాజ్యం, దొంగల ప్రభుత్వానికి ప్రజలు చమరగీతం పాడే సమయం ఆసన్నమైందని, జగన్ తన స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని విధ్వంసం చేయడమే అజెండాగా పెట్టుకున్నాడని విమర్శించారు. పాదయాత్రలో మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మబలికాడని, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతరాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. దీంతో ఇతర రాష్ట్రాలకు వలసలు పెరిగాయన్నారు. కూటమి గెలిస్తే రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమం అందరికీ అందుతాయన్నారు. అనంతరం రాయుడుపాకల గ్రామం నుంచి కొంతమూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 9 హామీలు అమలు

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



కడియం, ఏప్రిల్ 5: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 9 హామీలు అమలు చేస్తామని ఆపార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు తెలిపారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతులకు పెట్టుబడికి 50శాతం లాభంతో మద్దతు ధర, పదేళ్ల పాటు ప్రత్యేక హోదా అమలు, పెన్షన్లు పెంపు వంటి హామీలు అమలు చేస్తామన్నారు. శుక్రవారం మండలంలో జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, సీనియర్ నాయకుడు తాడాల కొండ్రాజు, ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి మురళి తదితరులతో కలిసి కడియం, కడియపులంక గ్రామాల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించారు. అనంతరం కొండ్రాజు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రుద్రరాజు మాట్లాడారు. కర్ణాటకలో 5 గ్యారంటీలు, తెలంగాణాలో 6 గ్యారంటీలు అమలు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు మనోజ్, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరు శ్రీనివాస్, ముల్లా మాధవ్, మార్టిన్ లూథర్, పులిశెట్టి సత్తిబాబు, జెట్టి రామారావు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి